క్లుప్తంగా

నేడు సీఎం జగన్ జన్మదిన వేడుకలు

తుని: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శ్రీరామా సెంటర్లో నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు ఏలూరి బాలు బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు కేక్ కటింగ్ జరుగుతుందని, అనంతరం పాలూరి పెట్రోల్ బంకు ఎదురుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

అరుణాచలానికి ఆర్టీసీ బస్సులు

తుని: తుని డిపో నుంచి అరుణాచలం గిరిప్రదర్శనకు ఆర్టీసీ సర్వీసును నడుపుతున్నట్టు డిపో మేనేజర్ ఎస్ కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ప్రతి నెలా పౌర్ణమి ముందురోజు తునిలో బస్సు బయలుదేరి విజయవాడ, శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, కంచి మీదుగా అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరిప్రదర్శన అనంతరం తిరుగుప్రయాణమై తుని చేరుకుంటుందన్నారు. టిక్కెట్లు కావాల్సిన వారు 73829 13216, 73829 13016, 73829 21904 నంబర్లను సంప్రదించాలన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

ఉపాధి మేట్లకు శిక్షణ



గోకవరంలో ఉపాధి మేట్లకు శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

గోకవరం: ఉపాధి హామీ పథకంలో గోకవరం మండలానికి చెందిన మేట్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 14 పంచాయతీలకు చెందిన 154 మంది మేట్లకు ఈ పథకంలో రాజీలేని అంశాలు, మస్టర్ నిర్వహణ, యాప్ ద్వారా హాజరు వేయడం, గ్రూపు నుంచి డిమాండ్ సేకరించడం, జాబ్ కార్డ్ అప్‌డేట్, పని ప్రదేశంలో సౌకర్యాల కల్పన, పనులకు కొలతలు ఎలా వేయాలన్న అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.పద్మాజ్యోతి, ఏపీఓ పీఎస్ అప్పలరాజు, జేఈ ఏ.రత్నరాజు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గౌరంపేట గ్రామంలో బుధవారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికతీత చేపట్టారు. గ్రామం నలుమూలలా బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచికారీ చేశారు. సర్పంచ్ ఏసుబాబు మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

దివ్యాంగులు ప్రత్యేక గుర్తింపు సాధించాలి



తేటగుంటలో దివ్యాంగుడికి ట్రై సైకిల్ ఇస్తున్న చైర్మన్ రాంబాబు రాజు

తుని రూరల్: సమాజంలో నిలదొక్కుకునేందుకు దివ్యాంగులు ప్రత్యేక గుర్తింపు సాధించాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు అన్నారు. బుధవారం తుని మండలం తేటగుంటలోని జెడ్పీ హైస్కూల్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయుడు జి.వీరబాబు ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులతో అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థి లక్ష్మణరావుకు చైర్మన్ రాంబాబురాజు, సర్పంచ్ అత్తి నాగరాజు ట్రై సైకిల్ అందజేశారు.

స్వామివారికి సదస్యం

గండేపల్లి: తాళ్లూరులో వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి బుధవారం సదస్యం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి బెల్లం పానకం, వడపప్పు, చలివిడి నివేదించి, విసెన కర్రలతో విసిరారు. సమాజంలో ప్రజలందరికీ క్షుద్బాధ లేకుండా చూడాలని, సుఖంగా ఉండాలని అర్చకుడు వీఎస్ఎన్ మూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా గుమ్మళ్లదొడ్డి ఆచార్యుల శత జయంతి

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామానికి చెందిన ఆచార్య (ఎస్‌టీపీ తిరుమలాచార్య) శత జయంతి ఉత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈయన యజుర్వేద పండితులుగా సుప్రసిద్ధులు. 1960లో గ్రామానికి వచ్చిన ఆయన గ్రామంలోని శ్రీరామగిరి దేవాలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దారు. ఈయన శిష్యులు అనేక దేవాలయాల్లో అర్చకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సుమారు 35 ఏళ్ల పాటు శ్రీరామగిరి కొండపై దేవాలయం కైంకర్యాలు నిర్వహించారు. ఆయన ఆధ్వర్యంలో జిల్లాలోని అనేక దేవాలయాల్లో ధ్వజస్తంభ ప్రతిష్ఠలు, దేవతా మూర్తుల ప్రతిష్ఠలు జరిగాయి. ఆయన శత జయంతిని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన శిష్యులు, కుటుంబ సభ్యులు ఘనంగా పూజలు నిర్వహించారు.

లెక్క తేలింది

- మిచాంగ్ తుపానుతో 8,831 ఎకరాల్లో నష్టం
- మునిగిన పంటకు పరిహారమే తరువాయి..
- సామాజిక తనిఖీలకు 24 వరకు గడువు
- రైతులకు గతంకంటే మిన్నగా పరిహారం

తుని రూరల్: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన పంట లెక్కలు తేలాయి. బాధిత రైతులకు పరిహారం అందడమే తరువాయి. తుపాను ప్రభావంతో వ్యవసాయ శాఖ తుని సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఈ నెల 17 వరకు క్షేత్ర స్థాయిలో అధికారులు పంట నష్టం నమోదు చేశారు. సేకరించిన వివరాలను రెండు రోజుల్లో ఆన్‌లైన్ చేసి, అధికారులు సామాజిక తనిఖీల కోసం బాధితుల జాబితాలను ఆయా గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల నోటీసు బోర్డుల్లో మంగళవారం ఏర్పాటు చేశారు. అభ్యంతరాలుంటే ఈ నెల 24వ తేదీ సాయంత్రంలోగా రాతపూర్వకంగా అందజేయాలని పేర్కొన్నారు. సమగ్ర నివేదికను ఈ నెల 26న అందజేయనున్నారు. గత ప్రభుత్వాల కంటే మిన్నగా పరిహారం అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఆదేశాలతో అధికారుల శరవేగంగా పంట నష్టం నమోదు ప్రక్రియను పూర్తి చేశారు. ఇప్పటి వరకు హెక్టారుకు రూ.15 వేలు పరిహారం అందించగా, ఈసారి రూ.17 వేల చొప్పున అందించనున్నారు.

8,831 ఎకరాల్లో పంట నష్టం

మిచాంగ్ తుపాను తాకిడి సబ్ డివిజన్ పరిధిలోని తుని, తొండంగి, కోటనందూరు, శంఖవరం, రౌతులపూడి మండలాలపై తీవ్ర ప్రభావం చూపింది. భారీ వర్షాలకు 9,158 మంది రైతులకు చెందిన 8,831 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. ఇందులో 8,987 మంది రైతులకు చెందిన 8,686 ఎకరాల్లో వ్యవసాయ పంటలు, 171 మంది రైతులకు చెందిన ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ఇప్పటికే హెక్టారుకు రూ.17 వేల చొప్పున అందించనున్నట్టు ప్రకటించడంతో రైతులు రూ.ఆరు కోట్లకు పైగా పరిహారం రూపేణా పొందనున్నారు. నిబంధనలకు అనుగుణంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వ్యవసాయ అధికారులు వెల్లడించారు.

పారదర్శకంగా పంటనష్టం అంచనాలు



బాధిత రైతులందరికీ న్యాయం జరిగేలా పంట నష్టం నమోదు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాం. బాధితుల నుంచి సేకరించిన వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. సామాజిక తనిఖీ కోసం బాధితుల జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాం. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 24లోగా తెలియజేయవచ్చు. అభ్యంతరాలను నివృత్తి చేశాక తుది జాబితాను ప్రభుత్వానికి పంపిస్తాం. జాబితా ఆధారంగా బాధితుల బ్యాంకు ఖాతాల్లోకి పరిహారాన్ని ప్రభుత్వం జమ చేయనుంది.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని



చామవరంలో మిచాంగ్ తుపానుకు దెబ్బతిన్న టమాట పంట

సబ్ డివిజన్‌లో పంట విస్తీర్ణం, బాధిత రైతుల వివరాలు

మండలం	పంట నష్టం(ఎకరాల్లో)	బాధిత రైతులు
తుని	818	1,159
తొండంగి	4,851	5,385
కోటనందూరు	2,148	1,526
శంఖవరం	357	323
రౌతులపూడి	512	594



హెచ్.కొత్తూరులో బాధితుల జాబితాను ఆర్బీకేలో ఏర్పాటు చేస్తున్న ఏఈఓ, వీఏఏలు

మంత్రిని కలిసిన హేమంత్



మంత్రి రాజాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న హేమంత్

తుని: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో వైఎస్సార్ సీపీ స్టేట్ యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీగా నియమితులైన మడదా హేమంత్ బుధవారం మంత్రి దాడిశెట్టి రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. తుని మండలం ఎస్ అన్నవరం క్యాంపు కార్యాలయంలో హేమంత్ మంత్రి రాజాను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హేమంత్‌ను మంత్రి రాజా అభినందించి, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

డివైడర్‌ను ఢీకొన్న స్కార్పియో

తొండంగి: బెండపూడి శివారు జాతీయ రహదారిపై తమ్మయ్యపేట వద్ద బుధవారం రాత్రి స్కార్పియో వాహనం డివైడర్‌ను ఢీకొంది. హైదరాబాద్ నుంచి అరకు వెళ్తున్న ఈ వాహనం తమ్మయ్యపేట వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కింది. ఎవరికీ ఎటువంటి అపాయం జరగలేదు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సంక్షేమాభివృద్ధికి జగనే మళ్లీ సీఎం కావాలి



తొండంగి మండలం యర్రయ్యపేటలో పార్టీ జెండాను ఆవిష్కరించిన నాయకులు

తొండంగి: రాష్ట్రంలో నవరత్నాలతో కూడిన సంక్షేమాభివృద్ధి కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం కావాలని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. బుధవారం జి.ముసలయ్యపేటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పేదలకు మంచి చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అందించారన్నారు. కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షలకు పెంచారన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. అనంతరం పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గాబు రాజు, కొయ్యా మురళి, దడాల విజయ్‌బాబు, దూలం బాబూరావు, ఎంపీటీసీ దూలం నూకరాజు, దూలం రమణ, సిరిపిన రమణ, యాదాల బాబ్జి, కందాల సత్యనారాయణ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ఇందుగపల్లిలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

సీఎం జగన్‌ను ఆశీర్వదించండి

కోటనందూరు: వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు కోరారు. ఇందుగపల్లిలో బుధవారం సాయంత్రం సర్పంచ్ కుంచే సత్యవతి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ఊపిరిగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి, తుని నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న మంత్రి దాడిశెట్టి రాజాకు అండగా నిలవాలన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి సంక్షేమ పథకాల బోర్డు, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఇంటింటా తిరిగి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, ఏఎంసీ చైర్మన్ లంక ప్రసాద్, పార్టీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు, సర్పంచ్ సుర్ల రాంబాబు, కుంచే అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు జగన్‌తోనే సాధ్యం

ఏలేశ్వరం: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా పార్థసారథి అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం లింగంపర్తి గ్రామంలోని సచివాలయం-1 పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకూ న్యాయం జరుగుతోందన్నారు. ప్రతి పేదవాడికి ఆర్థిక భరోసా కల్పిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయాలన్నారు. తొలుత సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిక్కాల లక్ష్మణరావు, యార్లగడ్డ రాజాచౌదరి, గుండుబిల్లి చక్రం, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



లింగంపర్తిలో పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పంట సాగు పద్ధతులపై అవగాహన

కిర్లంపూడి: రాజమహేంద్రవరం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కళాశాలకు చెందిన విద్యార్థులు పంట సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు బూరుగుపూడిలో నాలుగు నెలలు రైతులలో కలిసి పంట సాగు మెళకువలపై శిక్షణ పొందారు. కళాశాల అసోసియేట్ డీన్ సీహెచ్ శ్యామ్‌రాజ్‌నాయక్ అధ్యక్షతన బూరుగుపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక తులన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామంలోని వ్యవసాయ భూములు, నీటి వనరుల లభ్యతతో కూడిన చిత్రపటం నమూనా ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఉప సర్పంచ్ పాటంశెట్టి కృష్ణమూర్తి, ఏరువాక కోఆర్డినేటర్ నరసింహారావు, పాటంశెట్టి తమ్మారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.



బూరుగుపూడి గ్రామ చిత్రపటం ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

వెటర్నరీ అసిస్టెంట్ అదృశ్యం

తొండంగి: మండలంలోని పీఈ చిన్నాయపాలేనికి చెందిన గ్రామ సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ డి.వెంకట సతీష్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్సై వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఏడాది క్రితం సతీష్‌కు వివాహం జరిగింది. ఈ నెల 15 నుంచి అతడు కనిపించడం లేదని తండ్రి పాపారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

ప్రత్తిపాడు: రానున్న ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు పిలుపునిచ్చారు. లంపకలోవ గ్రామంలో బుధవారం సాయంత్రం లిబరేషన్ లోకల్ మహాసభ జరిగింది. ఈ మహాసభకు సామిరెడ్డి నారాయణమూర్తి పరిశీలకునిగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏగుపాటి అర్జునరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వాన్ని ఓడించాలనే నినాదంతో గ్రామగ్రామాన ప్రచారం చేయాలని కోరారు. అవినీతి, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడాలని, అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మాను కొండ లచ్చబాబు, అనుబంధ సంస్థల నాయకులు రాజాల రత్నం, బీరా దేవతయ్య, రాజమ్మ, మరియమ్మ, బండి ఏసుబాబు, పల్నాటి నూకరత్నం, బర్రె నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న అర్జునరావు

ప్రజల ఆరోగ్యమే రాష్ట్రానికి మహాభాగ్యం

- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితి రూ.25 లక్షలకు పెంపు
- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గండేపల్లి: రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యంగా భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.ఐదు లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన సర్వసభ్య సాధారణ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజానీకానికి సైతం కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఖరీదైన వైద్యం అందించాలనే సంకల్పంతో ఆరోగ్యశ్రీ నిధులు పెంచడంతో అన్ని వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా కృషి చేద్దామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నవరత్నాల ద్వారా లబ్ధి చేకూరని వారికి ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు వివరించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అక్కడి నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో, సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, ఎంపీటీసీలు చెల్లూరి రాంబాబు, గొల్లేపల్లి రవి, బొర్రంపాలెం సర్పంచ్ పోకల సబ్బు, కోఆప్షన్ సభ్యుడు సుదర్శన్ సామ్యూల్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



గండేపల్లిలో లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

అందరికీ సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఏలేశ్వరం: రాష్ట్రంలో ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల హైమావతి అన్నారు. స్థానిక మార్కెట్ వీధిలోని ఐదో సచివాలయంలో ఆమె బుధవారం ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ఆరోగ్యశ్రీ కార్డు లబ్ధిదారులకు రూ.25 లక్షల వరకు పరిమితిని పెంచడం అభినందనీయమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకూ మేలు జరుగుతోందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలందరూ ఆయనకు మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, సామంతుల సూర్యకుమార్, దిలబర్ హుస్సేన్, పైల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో ఆరోగ్యశ్రీ కార్డులను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మార్కెట్ యార్డులో రోడ్లు, ప్రహరీ నిర్మాణం



మార్కెట్ యార్డులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మాకినీడి బాబు, సభ్యులు

తుని: తుని వ్యవసాయ మార్కెట్ యార్డులో అంతర్గత సీసీ రోడ్లు, ప్రహరీ నిర్మాణ పనులను చేపడుతున్నట్టు ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు తెలిపారు. బుధవారం మార్కెట్ యార్డులో ప్రహరీ పనులను ప్రారంభించారు. నిత్యం రద్దీగా ఉండే మార్కెట్‌లో అంతర్గత రోడ్లు లేకపోవడంతో రైతులు, వ్యాపారులు రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన డెక్కన్ కెమికల్స్ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి, సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.65 లక్షలు మంజూరు చేయించినట్టు మాకినీడి బాబు చెప్పారు. ఈ నిధులతో అంతర్గత సీసీ రోడ్లు, ప్రహరీ నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

గిరిజన తండాల్లో సెబ్ దాడులు

ప్రత్తిపాడు: ఉలిగోగులు, మెట్టుచింత గిరిజన తండాల్లో సారా స్థావరాలపై బుధవారం ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) బృందం పెద్దఎత్తున దాడులు నిర్వహించింది. స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ కథనం మేరకు, ప్రత్తిపాడు మండలం ఉలిగోగుల అటవీ ప్రాంతంలో సారా స్థావరాలపై ఈ దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను, మెట్టుచింత అటవీ ప్రాంతంలో 300 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. రెండు స్థావరాల్లో 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సంఘటన ప్రాంతాల నుంచి పరారైన పెంకి సుబ్రహ్మణ్యం, పిల్లి అబ్బాయి అనే బుజ్జియ్యపై కేసులు నమోదు చేశారు. ఆయా దాడుల్లో కాకినాడ జిల్లా ఇంటెలిజెన్స్ వింగ్ ఇన్‌స్పెక్టర్ కె.గిరిధర్, స్థానిక సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఉలిగోగుల అటవీ ప్రాంతంలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ సిబ్బంది

రీ సర్వేను త్వరగా పూర్తి చేయండి

కోటనందూరు: మండలంలో జరుగుతున్న భూముల రీ సర్వే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు విలేజ్ సర్వేయర్లను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం విలేజ్ సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్వే జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో విధిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పూర్తి పారదర్శకంగా సర్వే చేయాలని సూచించారు. విలేజ్ సర్వేయర్లంతా సమన్వయంతో పని చేసి, సర్వేను శరవేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కె.కుశరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సీతారామారావు

ఓటింగ్ యంత్రాలపై అపోహలు వద్దు

ప్రత్తిపాడు: ఓటింగ్ యంత్రాలపై అపోహలు వద్దని తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ అన్నారు. ఓటింగ్ యంత్రాల వినియోగంపై ప్రత్తిపాడు మార్కెట్ సెంటర్, ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఆవరణలో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈవీఎం, వీవీప్యాట్ల పనితీరును, ఓటు హక్కును వీటి ద్వారా ఎలా వినియోగించుకోవాలో వివరించారు. మార్కెట్ సెంటర్‌లో పలువురు వర్తకులు, ప్రజలు, ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులతో ఈవీఎం ద్వారా ఓటు వేయించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ కాసులమ్మ, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రయాణికులకు ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

విద్యార్థులతో గ్రామ నమూనా పటం

జగ్గంపేట: రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు మండలంలోని కాట్రావులపల్లిలో బుధవారం గ్రామ నమూనా పటం ఏర్పాటు చేసి, రైతులకు వివరించారు. గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక తులనలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ సీహెచ్ శ్యామ్‌రాజ్ నాయక్, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ సీహెచ్‌వీ నరసింహారావు, కళాశాల ప్రొఫెసర్ టి ఉషారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.